

చైన్ లాగి...రైలును ఆపి

కమలాపురం సమీపంలో సాఫీగా వెళుతున్న రైలు చైన్ లాగి..కిటికీల పక్కన నిద్రిస్తున్న ముగ్గురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలు లాక్కెళ్లారు. -8లో..



వాహనం తీసేసినా.. పన్ను పడుద్ది

వాహనాన్ని స్క్రాప్‌కు వేసినా, ఇతరులకు విక్రయించినా అధికారులకు దృష్టికి తీసుకెళ్లాలి. లేకపోతే పన్నులు చెల్లించాల్సి వస్తుంది. -8లో..



తప్పిన ప్రమాదం

ఎర్రగుంట్ల మండలం పి వెంకటాపురం మాలెపాడు గ్రామాల మధ్య బాలసుబ్బన్న ప్రయాణిస్తున్న కారు ఇంజన్‌లో నుంచి మంటలు వ్యాపించి కాలిపోయింది. -8లో..

న్యూస్‌రీల్

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–తిరుపతి–కడప మధ్య తిరుగుతున్న ఏపీఎస్ ఆర్టీసీ విద్యుత్ ఏసీ బస్సులు నడిపేందుకు అర్హులైన డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యూనివర్సల్ మొబిలిటీ ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు 58 సంవత్సరాలు మించరాదని, కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తయి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు, ఐదు ఫొటోలు, ఆర్టీఏ క్లియరెన్స్ సర్టిఫికెట్ లేటెస్ట్ (ఐదు సంవత్సరాలు)తో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 83410 27109, 91825 76787 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: కడపలోని ఏపీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 3వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ పి. విజయలక్ష్మి తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బ్యాక్‌లాగ్ సీట్లకు గిరిజన బాలికలు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థినులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థినుల ఎంపిక కడపలోని జిల్లా గిరిజన సంక్షేమాధికారి కార్యాలయంలో లాటరీ విధానంలో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 94406 87844 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బధిరుల మహిళా క్రికెట్ జట్టుకు నవ్య



కడప స్పోర్ట్స్: కడప నగర పరిధిలోని దండు గ్రామానికి చెందిన మెల్లా నవ్య సరోజిని జాతీయస్థాయి బధిరుల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఏపీ మహిళల జట్టుకు ఎంపికైంది. ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించనున్న ఐడీసీఏ ఉమన్స్ 4వ టీ–10 నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ జట్టులో ఈమె పాల్గొంటుంది.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

వైవీయూ: జిల్లావ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న హైస్కూల్ ప్లస్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ)గా పనిచేసేందుకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 10 సబ్జెక్టులకు గాను 92 ఖాళీలకు గాను 75 మంది ఉపాధ్యాయులు పీజీటీలుగా పదోన్నతులు కోరుకున్నారు. మొత్తం మీద 265 దరఖాస్తులు రాగా 75 మంది పీజీటీలుగా పదోన్నతులు పొందారు. జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు స్థానాలను ఆప్ట్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు పోస్టులకు 21న..

వైవీయూ: జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మిగిలిన ఖాళీల్లో పీజీటీ రీడిప్లాయ్‌మెంట్ ద్వారా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 21న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఖాళీల వివరాలిలా ఉన్నాయి.

జెడ్పీహెచ్ఎస్ ప్లస్	సబ్జెక్టులు
గోపవరం	మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ
తాళ్లప్రొద్దుటూరు	మ్యాథ్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్, కామర్స్
ముద్దనూరు	ఫిజిక్స్
వేంపల్లి	కామర్స్
చిలంకూరు	కామర్స్
కోడూరు	సివిక్స్, ఎకనామిక్స్
రాజంపేట	మ్యాథ్స్
నాగిరెడ్డిపల్లి, నందలూరు	మ్యాథ్స్, జువాలజీ

నిప్పుల వాన



'ఒరే వీరయ్య..ఇదేం ఎండరా సామి..నా డెబ్బై ఏళ్లలో ఎప్పుడూ చూడలేదు'..నడి నెత్తిన నుంచి ధారగా కారుతున్న చెమటను తుడుచుకుంటూ అన్నాడు రంగయ్య. అవున్రా రంగ మామ..మా తాతలు ఎన్నో సంగతులు చెప్పారు. ఇంత ఎండ ఉంటాదని ఎప్పుడూ చెప్పలేదు. అని చెట్టు నీడ వైపు అవదుగులేస్తూ బదులిచ్చాడు వీరయ్య. ప్రస్తుతం జిల్లాలో ఇదే చర్చ సాగుతోంది. ఎండ ప్రచండంగా మారింది. పై నుంచి నిప్పుల వాన కురుస్తోందనే భావన కలుగుతోంది. ఈ వేసవి హాట్..హాట్‌గా మారింది. దీంతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మే మాసమంతా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- జిల్లాలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతల నమోదు
- 2019లో 41 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు
- నేడు 46 డిగ్రీలకు చేరువలో
- రాత్రిళ్లు కూడా చల్లారని సెగలు



కడప నగరంలో బోసిబోయిన రిమ్స్ రహదారి



కడప రూరల్: వానలు బాగానే పడ్డాయి. ఎండలు సరిగా ఉండవని చాలా మంది భావించారు. అయితే మార్చి నుంచే ఎండలు ప్రారంభం అయ్యాయి. మే నెలకు వచ్చే సరికి వేడి సెగలు బుస కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో వరుణుడు అలా వచ్చి పలకరించి పోయాడు. దీంతో కాస్త వాతావరణం చల్లబడింది. మళ్లీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించాడు.

జనాలు బెంబేలు..

ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభం అవుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5–6 గంటల వరకు వేడి తీవ్రత తగ్గడం లేదు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా దాదాపు పగటి పూట వాతావరణాన్ని తలపిస్తోంది. దీంతో రాత్రిళ్లు కూడా సెగలు చల్లారడం లేదు. ఇంట్లోని ఫ్యాన్, కూలర్, ఏసీ నుంచి వచ్చే గాలులు కూడా ఎడారి వేడి గాలులను తలపిస్తున్నాయి.దీంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కూలి పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- ఏ వేసవి కాలమైనా సరే మే మాసంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అయితే ఈ మే నేలలో ధార్ ఎడారి (వాయువ్య దిశ) నుంచి వీస్తున్న వేడి గాలుల ప్రభావంతో ఎండలు మండిపోతున్నాయి. ప్రధానంగా పెట్రోల్, డీజిల్ వాడకం , కర్మాగారల నుంచి వెలువడే వాయువులు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. వేడెక్కిస్తున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు.

ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

- ఈ వేసవిలో జాగ్రత్తలు పాటించడం అత్యంత ప్రాధాన్యకరమైన అంశం. తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా తిరగకూడదు. రోడ్లపై ఉండే కలుషిత ఆహారం, చల్లని రంగు పానీయాలు తాగరాదు. మద్యం సేవించకూడదు. మాంసాహారాన్ని తగ్గించాలి. తాజా కారగాయలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవాలి.

జిల్లాలో మే నెలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

సంవత్సరం	గరిష్ట (పగలు)	కనిష్ట (రాత్రి)
2019	41.00	30.04
2020	40.09	28.07
2021	39.00	26.09
2022	37.04	26.08
2023 (18వ తేదీ వరకు)	45.01	35.01

2023 జనవరి నుంచి మే 20వ తేదీ వరకు నమోదైన అధిక ఉష్ణోగ్రతలు

నెల	గరిష్టం	కనిష్టం
జనవరి	31.00	15.09
ఫిబ్రవరి	34.08	17.01
మార్చి	35.09	21.05
ఏప్రిల్	39.03	25.00
మే	45.01	35.01

- నీళ్లు, పళ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, తదితర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. లేత రంగులో ఉండే కాటన్ దుస్తులు వేసుకోవాలి. ఒక రోజులో 15 గ్లాసుల నీరును తాగాలి.ఆహారాన్ని తక్కువ మోతాదులో ఎక్కువ మార్లు తీసుకోవాలి. అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి. వెళ్లినప్పుడు తప్పని సరిగా గొడుగును తీసుకెళ్లాలి..లేదా టోపీ ధరించాలి.
- శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట పట్టకపోవడం , వణుకు పుట్టడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం వడ దెబ్బ లక్షణాలు. అలాంటి వ్యక్తికి నీళ్లు తాగించకూడదు. చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణాన్ని తాపించాలి. వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి....



జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడ దెబ్బ తగల కుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ను అందుబాటులో ఉంచాం. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కర పత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణం ఆసుపత్రులకు వెళ్లి ఉచితంగా వైద్య సేవలను పొందాలి. – డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

వాయువ్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయి.



వాయువ్య దిశ నుంచి వేడి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు వాతావరణంలో కూడా మార్పులు సంభవించాయి. సహజంగానే మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ సారి కాస్త ఎక్కువగా ఉన్నాయి. – స్వామి చైతన్య, శాస్త్రవేత్త, కడప

కట్టుదిట్టంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి

వైవీయూ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి కట్టుదిట్టంగా నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి పేర్కొన్నారు. శనివారం కడపలోని సెయింట్‌జోసఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ప్రథమ సంవత్సరం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతయాని తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆర్ఐఓ రమణరాజు మాట్లాడుతూ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 16,486 మంది, ద్వితీయ సంవత్సరం 10,200 మంది, మొత్తం 26,686 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ నెంబర్ 08562–244171 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

నియామకం



హేమలత

చక్రాయపేట : రాయలసీమ కాపునాడు కడప పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సంగా హేమలత నియమితులయ్యారు. చక్రాయపేట మండలం కొండావాండ్లపల్లెకు చెందిన హేమలతకు రాయలసీమ కాపునాడు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఎలిసెట్టి సుహాసిని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ కాపుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన పెద్దలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్‌హెచ్‌జీలను బలోపేతం చేయాలి

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పేదరికం నిర్మూలన, అభివృద్ధి, సాధికారతకు ఆయువు పట్టుగా ఉన్న స్వయం సహాయక సంఘాలను (ఎస్‌హెచ్‌జీ) మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా అందించే రూ. 35 వేల రుణ సాయాన్ని లబ్దిదారులకు అందేలా చూడాలన్నారు. అమూల్ కంపెనీ భాగస్వామ్యంతో సాగుతున్న జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నడిపించాలన్నారు. చేయూత పథకం ద్వారా రుణాలు అందించి మహిళా పాడి రైతులు లాభాల్లో నడిచేలా చూడాలన్నారు. మండలాల్లో చిరు వ్యాపారులకు కూడా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. పీఎం స్వనిధి, జగనన్న తోడు పథకాలతోపాటు వ్యాపారాభివృద్ధి కోసం గ్రూపుల వారీగా రుణ సదుపాయం కల్పించాలని చెప్పారు. సభ్యులందరికీ పెన్షన్లు, ఆరోగ్యశ్రీకార్డులు, నివాస గృహాలు అందుతున్నాయో లేదో చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాలను వ్యవసాయం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. పాత దుస్తులు, చిత్తు కాగితాలు ఏరుకునే వారికి కూడా ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ,మెప్మా, హౌసింగ్ పీడీలు ఆనంద్‌నాయక్, సురేష్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు స్పందన కరువు

- సమావేశానికి డుమ్మా కొట్టిన ఇన్‌చార్జిలు
- టీడీపీలో చర్చనీయాంశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కడప రూరల్: ఈ నెల 23వ తేదీన తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర జిల్లాలోని జమ్మలమడుగు నియోజక వర్గంలోకి ప్రవేశించనుంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా టీడీపీ నేతలు శనివారం కడప రహమతీయ ఫంక్షన్ హల్‌లో ఏర్పాటు చేసిన మినీ మహానాడుకు తమ్ముళ్ల నుంచి స్పందన కరువైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లాలో చేపట్టే లోకేష్ పాద యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కాగా ఈ కార్యక్రమానికి కీలకంగా వ్యవహరించాల్సిన ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పలువురు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి, బద్వేల్, కడప నుంచి రితేష్ రెడ్డి, అమీర్‌బాబులు మాత్రమే పాల్గొన్నారు. సోమిరెడ్డి తన ప్రసంగంలో కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఏదో పనిపై వెళ్లారని చెప్పారు. మిగిలిన వారు ఎందుకు హాజరు కాలేదనేది ప్రశ్నార్థకంగా మారింది. కిందిస్థాయి కార్యకర్తలను చైతన్యవంతం చేయాల్సిన నేతలే సమావేశానికి హాజరు కాలేకపోవడం దారుణమని తమ్ముళ్లు చర్చించుకున్నారు. మొత్తం మీద మినీ మహానాడును తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల పార్టీలోనే అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సులభం..సౌకర్యవంతం

- ఆర్టీసీ డోర్ టు డోర్ సేవలు
- షిప్ మంత్ర యాప్ ద్వారా సరుకు రవాణా
- త్వరలో కడప, బెంగుళూరు, చెన్నైలలో ప్రారంభం



ఆర్టీసీ కార్గో కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా సరుకు రవాణా విజయవంతమైన నేపథ్యంలో ప్రజలకు మరింత సులభంగా, సౌకర్యవంతంగా డోర్ టు డోర్ సేవలు అందిచేందుకు సిద్ధమైంది. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఈ సేవలు అందించనుంది. అందులో భాగంగా ఏడు ప్రధాన పట్టణాలను గుర్తించి పైలెట్ ప్రాజెక్టుగా సేవలను ప్రారంభించారు. త్వరలో కడపతోపాటు బెంగళూరు,చెన్నై నగరాలను కలుపుకుని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

సరుకు రవాణాలో విజయం :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 2016 జూన్ 1న సరుకు రవాణా సేవలను ప్రారంభించింది. తర్వాత 2021 సెప్టెంబరులో కిలో బరువుగల కవర్లు, వస్తువులు మొదలుకొని 10 కిలోల వరకు పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీని రాష్ట్ర వ్యాప్తంగా 16 ఆర్టీసీ డిపోల్లో ప్రారంభించింది. తర్వాత 10 కిలోల బరువు నుంచి 50 కేజీలకు పెంచుతూ ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. సరుకును తీసుకెళ్లి రవాణా కార్యాలయంలో అందజేస్తే వారు వాటిని ఆయా ప్రాంతాలకు పంపించేవారు. అప్పటినుంచి ఆర్టీసీ రవాణా సేవల్లో దూసుకెళుతోంది. బుకింగ్ చేసిన వస్తువులను 24 గంటల్లోనే రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా చేరవేరేస్తోంది.

డోర్ పికప్, డోర్ డెలివరీ సేవలు

తాజాగా ఆర్టీసీ సంస్థ మరో అడుగు ముందుకేస్తోంది. 50 కిలోల బరువుగల వస్తువులను రవాణా చేసేందుకు డోర్ పికప్, డోర్ డెలివరీ చేసేందుకు సిద్ధమైంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన షిప్ మంత్ర యాప్ ద్వారా వినియోగదారులకు సేవలు అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ప్రధాన ప్రాంతాలను గుర్తించి ఏప్రిల్ 23 నుంచి ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం అక్కడ విజయవంతమైతే త్వరలో మిగిలిన ప్రాంతాల్లో కూడా అందుబాటులోకి తీసుకు రానున్నారు.

సేవలు పొందాలంటే...

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను ఆన్‌లైన్‌లో పొందాలంటే మొదటగా గుగూల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి షిప్ మంత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

- వినియోగదారులు 50 కేజీల్లోపు వస్తువులను నిర్దేశించిన ప్రాంతాల్లో ఎక్కడికి రవాణా చేయాలో నిర్ణయించుకోవాలి.
- షిప్ మంత్ర యాప్ ద్వారా సరుకు రవాణా చేసేందుకు సరుకు ఉన్న ప్రదేశం నుంచి వెళ్లాల్సిన ప్రదేశాన్ని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- వస్తువు బరువునుబట్టి ఆన్‌లైన్‌లోనే రుసుమును నిర్ణయిస్తారు.
- రుసుమును వినియోగదారుడు చెల్లించిన మూడు గంటల తర్వాత వస్తువును పికప్ చేసుకునేందుకు షిప్ మంత్ర ప్రతినిధులు చేరుకుంటారు.
- ఇలా తీసుకెళ్లిన వస్తువులను 24 గంటల్లోపు డోర్ డెలివరీ చేస్తారు.
- క్యూ వద్దు..క్యూఆర్ ముద్దు...అనే నినాదంతో వినియోగదారులకు సేవలు అందించనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

సమయం ఆదా అవుతుంది



వస్తు రవాణాకు సంబంధించి షిప్ మంత్ర యాప్ ద్వారా వినియోగదారులకు విశేష సేవలు అందించాలని నిర్ణయించాం. ఈ యాప్ ద్వారా సమయం ఆదా అవుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీ డోర్ పికప్, డెలివరీ సేవలను ప్రజలకు అందించనుంది. త్వరలో ఈ విధానాన్ని జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ప్రవేశ పెట్టనున్నాం. – గోపినాథ్‌రెడ్డి, కడపజోన్ ఈడీ, ఏపీఎస్ ఆర్టీసీ

క్లుప్తంగా

పాలిసెట్-23 ఫలితాలు విడుదల

వైవీయూ : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2023లో జిల్లా విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. జిల్లా వ్యాప్తంగా 4306 మంది బాలురు, 2919 మంది బాలికలు పాలిసెట్‌కు హాజరుకాగా 3627 మంది బాలురు, 2562 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 7225 మందికి గాను 6189 మంది విద్యార్థులు పాసై 85.66 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. కాగా జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. దువ్వూరు మండలం గుడిపాడుకు చెందిన వి. వెంకటశ్రీశాంత్‌రెడ్డికి 37 ర్యాంకు వచ్చింది. అలాగే మైదుకూరు మండలం అన్నలూరు నడింపల్లికి చెందిన బి.శ్రీధర్‌రెడ్డికి 57 వ ర్యాంకు, కడప నగరం చిన్నచౌక్‌కు చెందిన బి. నిషితకు 107వ ర్యాంకు వచ్చింది. వీరిని తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

చోరీకి విఫలయత్నం

కడప అర్బన్ : దొంగతనం చేసేందుకు వచ్చిన వారు కుక్క అరుపులకు పరారయ్యారు. చోరీకి విఫలయత్నం చేశారు. వివరాలు.. కడప నగరం రవీంద్రనగర్‌లో లా కళాశాల వెనుకభాగాన రాజు అనే వ్యక్తి మొదటి అంతస్తులో సంసారం ఉంటున్నాడు. అయితే శనివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో వారు పెంచుకుంటున్న కుక్క పెద్దగా మొరగడంతో ఉలిక్కిపడి లేచాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుకభాగం నుంచి పైకి వచ్చి చోరీ చేసేందుకు ప్రయత్నించారని.. తమ కుక్క (లైకీ) మొరగడంతో ఆ దొంగలు పరారయ్యారన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. కడప తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వేసవి సమయాల్లో అప్రమత్తంగా వుండాలని సూచించారన్నారు.

చైన్ లాగి.. రైలును ఆపి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే డీఎస్పీ షేక్ షాను



డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, పోలీసులు

- మహిళల మెడల్లోని మూడు బంగారు గొలుసుల చోరీ
- కమలాపురం-ఎర్రగుంట్ల మధ్యలో దొంగతనం
- తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో ఘటన

కడప కోటిరెడ్డిసర్కిల్/ కమలాపురం : సాఫీగా వెళుతున్న రైలు చైన్ లాగి.. కిటికీల పక్కన నిద్రిస్తున్న ముగ్గురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన సంఘటన కమలాపురం సమీపంలో చోటుచేసుకుంది. తిరుపతి నుంచి గుంటూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు (17262) శుక్రవారం అర్ధరాత్రి 11.27 గంటలకు కమలాపురం చేరుకుంది. 11.28 గంటలకు బయలుదేరిన రైలును నాలుగు కిలోమీటర్లు వెళ్లగానే రైలులో కాపుకాచిన దొంగల్లో ఒకడు చైన్‌ను లాగాడు. దీంతో రైలు 286/16 కిలోమీటరు నెంబరు వద్ద ఆగిపోయింది. స్లీపర్ బోగీల వద్దకు వచ్చిన దొంగలు కిటికీల పక్కన పడుకున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు ప్రతిఘటించగా, నిద్రిస్తున్న ముగ్గురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లారు. అర్ధరాత్రి కావడం...చల్లని గాలి కోసం కిటికీలను తెరిచి ఉంచడంతో దొంగలు కిందినుంచే సులువుగా చోరీ చేయగలిగారు. బయట చీకటిగా ఉండడంతో పారిపోతున్న దొంగలను ప్రయాణీకులు కనీసం ఫోటోలు కూడా తీయలేకపోయారు. తోటి ప్రయాణీకులు వెంటనే విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు చేరవేశారు. పది నిమిషాల తర్వాత అక్కడి నుంచి బయలుదేరిన రైలు 12.04 గంటలకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కూడా రెండు నిమిషాలు మాత్రమే ఆగిన రైలు 12.06 గంటలకు ఎర్రగుంట్లలో బయలుదేరి తర్వాత గుంటూరుకు వెళ్లిపోయింది.

ఘటనా స్థలం పరిశీలన..

తిరుపతి నుంచి గుంటూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన దొంగతనం ఘటనా స్థలాన్ని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, రైల్వే డీఎస్పీ షేక్ షాను శనివారం పరిశీలించారు. కమలాపురం-ఎర్రగుడిపాడు రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న సి.గోపులాపురం గ్రామ సమీపంలో ఘటన జరిగినట్లు టీటీ ద్వారా తెలుసుకున్న వారు అక్కడికి చేరుకున్నారు. కడప డీఎస్పీ షరీఫ్, కమలాపురం, ఎర్రగుంట్ల సీఐలు సత్యబాబు, మంజునాథరెడ్డి, వారి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌తో దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

54 గ్రాములు బంగారు చోరీ

తిరుపతి-గుంటూరు ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళల నుంచి 54 గ్రాముల బంగారు నగలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు అందినట్లు రైల్వే డీఎస్పీ షేక్ షాను తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 6 నుంచి 10 మంది దుండగులు ఉండవచ్చని ఎస్-1, ఎస్-5, ఎస్-6 కోచ్‌లలో ముగ్గురు మహిళలపై దాడి చేసి 54 గ్రాముల బంగారు చైన్లు స్నాచింగ్ చేశారన్నారు. ప్రతిఘటించిన సుబ్బారెడ్డి అనే ప్రయాణీకుడికి చిన్న గాయం అయిందన్నారు. ఈ ఘటన జరిగిన తక్షణం టీటీ ద్వారా తెలుసుకున్న తాము దుండగులు పారిపోవడానికి వీలున్న రాయచోటి, మైదుకూరు, తిరుపతి, ప్రొద్దుటూరు రూట్లలో ఉన్న హైవే పెట్రోలింగ్ వాహనాలతో పాటు స్థానిక సర్కిల్ పరిధిలోని రక్షక వాహనాలను, బీట్ పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. ఇప్పటికే డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్నామని, త్వరలోనే దుండగులను పట్టుకుంటామని ఆమె వివరించారు. రైల్వే సీఐ నాగార్జున, ఎస్ఐ రారాజు ఆమె వెంట ఉన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం కడప కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వికలాంగుల పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచాలని, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో వెంటనే వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. భార్యాభర్తలు ఇద్దరూ వికలాంగులైతే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఒకవేళ చదువు లేని వారైతే రూ. 5 లక్షల రుణసదుపాయం కల్పించాలన్నారు. తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలన్నారు. వివాహం చేసుకున్న వికలాంగుడు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా ప్రకటించాలన్నారు. ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, కుళాయి పన్ను రద్దు చేయాలని చెప్పారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. చట్టసభల్లో నాలుగు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్నసుబ్బయ్య యాదవ్, కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు మాతయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రెడ్డెయ్య, మహిళా అధ్యక్షురాలు లలిత, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగల అరెస్టు



పట్టుబడిన దొంగలతో పోలీసులు

జమ్మలమడుగు: పట్టణంలో చోరీకి గురయిన గొర్రెలను పట్టుకోవడంతోపాటు దొంగలను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సదాశివయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రోటరీ నగర్‌వద్ద ఉన్న ఉలవల అమరేశ్వరరెడ్డికి చెందిన గొర్రెలు, మేకలు , మేకపోతులను మేనెల 14, 15వ తేదీల్లో దొంగలు మొత్తం 18 జీవాలను దొంగలించారు. అదేవిధంగా దూదేకుల దస్తగిరి షెడ్డులో నుంచి 13 జీవాలను దొంగతనం చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. అయితే శనివారం దొంగలించిన గొర్రెలను మైదుకూరు సంతకు తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ఎస్ ఆర్ పెట్రోల్ బంకు వద్ద కాపు కాచి లారీలో వెళుతున్న 31 జీవాలను స్వాధీనం చేసుకున్నామని, దొంగలను అరెస్టు చేసినట్లు వివరించారు. వనం హరి, శ్రీరాముల సుంకన్న, జగన్నాథం వెంకటేష్, పొంగా రవి, బొగాల గంగాధర్‌రెడ్డిలను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె.సుబ్బారావుతో పాటు, ఐదుమంది కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

సుమో ఢీకొని కౌలు రైతు మృతి



వెంకట్రాములు (ఫైల్)

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు పంచాయతీ పరిధిలోని నక్కలపల్లె సమీపాన శనివారం వేకువజామున సుమో ఢీకొట్టడంతో కౌలు రైతు దంపెట్ల వెంకట్రాములు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ రోషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకట్రాములు సొంతూరు తొండూరు మండలం కోరవానిపల్లె కాగా.. ఆయన పులివెందులలో కాపురం ఉంటూ లోమడ గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డికి చెందిన 6ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి పంటను సాగు చేశాడు. అక్కడే గొర్రెలను ఉంచి ప్రతి రోజు పులివెందుల నుంచి లోమడ గ్రామానికి వేకువజామున వెళుతుండేవాడు. ఇదే క్రమంలో శనివారం తెల్లవారుజామున వెంకట్రాములు టీవీఎస్ ఎక్సెల్‌పై, సోదరుడు రామ్మోహన్ బైకుపై బయలుదేరారు. ఇంతలోనే నక్కలపల్లె సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ఏపీ04ఏఎల్ 3321 అనే నెంబర్ గల టాటా సుమో ఢీకొట్టడంతో వెంకట్రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకట్రాములుకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు.

ఈతకెళ్లి మృత్యువాత

రాయచోటి టౌన్ : సరదాగా తల్లితో కలసి ఈతకెళ్లిన ఓ చిన్నారి నీటి మడుగులో పడి మృత్యువాత పడింది. బాధితురాలు రాయుడు కాలనీకి చెందిన యాస్మిన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాస్మిన్.. షేక్ సల్మా, ఆసిక్ తో అనే తన ఇద్దరి పిల్లలతో కలసి రాయచోటి పట్టణం కంచాలమ్మ గండిలో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతూ ఉన్న సమయంలో సల్మా (16) నీటి మడుగులోకి వెళ్లడం అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక మునిగిపోతూ కేకలు వేసింది. కానీ ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో తన కుమార్తెను కాపాడేందుకు ఎవరూ లేకపోవడంతో రాయచోటి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి మృత్యువాత పడిన సల్మా మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రహస్యంగా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వారి వద్ద నుంచి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది సమగ్రంగా విచారిస్తున్నారు.

తప్పిన ప్రమాదం



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని పి వెంకటాపురం మాలెపాడు గ్రామాల మధ్య ఆర్టీపీపీలో పనిచేస్తున్న బాలసుబ్బన్న ప్రయాణిస్తున్న కారు ఇంజన్‌లో నుంచి మంటలు వ్యాపించి కారు కాలిపోయిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. విషయం తెలిసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఆర్టీపీపీలో పనిచేస్తున్న బాలసుబ్బన్న శనివారం ప్రొద్దుటూరు నుంచి పొట్లదుర్తి మీదుగా ఆర్టీపీపీకి బయలుదేరారు. మాలెపాడు, పి వెంకటాపురం గ్రామాల మధ్యకు రాగానే కారులోని ఇంజన్ నుంచి మంటలు వ్యాపించాయి. కారులో ఉన్న ఆ వ్యక్తి దిగి చూడగానే మంటలు పూర్తిగా వ్యాప్తించాయి. వెంటనే స్థానికులతో సమాచారం అందుకున్న ఆర్టీపీపీకి చెందిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. అయితే ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాని పోలీసులు పరిశీలించారు.

బైక్‌లో వెళుతూ కిందపడిన యువతి



బైక్‌లో నుంచి కిందపడిపోయిన యువతి హరిణి

సిద్దవటం : కడప నగరానికి చెందిన హరీష్ తన చెల్లెలు హరిణితో కలిసి భాకరాపేట వైపునుంచి కడపకు బైకులో వెళుతుండగా జెఎంజె కళాశాల వద్ద హరిణి కిందపడిపోయింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం సాటిలైట్ సిటీకి చెందిన హరీష్ తన చెల్లెలును బైకులో వెనుకవైపు కూర్చోబెట్టుకొని శనివారం సాయంత్రం సిద్దవటం మండలం భాకరాపేట వైపు నుంచి కడపకు ప్రయాణించారు. బైక్ సిద్దవటం మండల శివారులో ఉన్న జెఎంజె కళాశాల వద్దకు వెళ్లగానే ఉన్నట్లుండి హరిణి బైక్‌పైనుంచి కిందపడిపోయింది. చెక్‌పోస్టు వద్ద ఉన్న అటవీశాఖ సిబ్బంది హుటా హుటిన వెళ్లి కిందపడ్డ యువతిని నీరు తాపేందుకు పైకి లేపే ప్రయత్నం చేయగా ఆమె మళ్లీ కింద పడిపోయింది. సకాలంలో 108 వాహనం అందుబాటులో ఉండటంతో అపస్మారక స్థితిలో ఉన్న యువతిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి అటవీ సిబ్బంది తరలించారు.

పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఢీకొన్న బస్సు

రామాపురం : కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి గువ్వలచెరువు సమీపంలోని కొత్తరోడ్డు నారాయణపురం వద్ద గల పోలీస్ చెక్ పోస్టును బస్సు ఢీకొంది. శనివారం ఉదయం కడప వైపు నుండి రాయచోటి వైపు వెళ్తున్న వీఆర్‌సీఆర్ బస్సు ఢీ కొంది. దీంతో బస్సు ముందు భాగం కొంతమేర దెబ్బతింది. చెక్‌పోస్టు పాక్షికంగా దెబ్బతింది. ఈ బస్సును మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

వాహనం తీసేసినా.. పన్ను పడుద్ది

- స్క్రాప్‌కు వేసినా, వాహనం వద్దనుకున్నా.. దరఖాస్తు తప్పని సరి
- లేకుంటే ఏదైనా ఘటన జరిగితే యజమానులదే బాధ్యత

వైఎస్ఆర్ జిల్లాకు చెందిన ఒక డ్రైవర్ కారు కొనుగోలు చేశాడు. కొంతకాలం తరువాత స్క్రాప్ కింద విక్రయించేశాడు. కానీ రవాణాశాఖ అధికారులు పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చారు. హడావిడిగా రవాణాశాఖ అధికారులను కలిసి కారును స్క్రాప్ కింద విక్రయించేశానని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆ విషయాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉందని అధికారులు బదులిచ్చారు. ఆఖరికి నాలుగు త్రైమాసికాలు పన్నులు చెల్లించాడు. ఇలా చాలా మంది ఇబ్బంది పడుతుండటారు. దీనిపై అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నూతన వాహనం కొనుగోలు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు సరి చూసుకోవటమే కాదు.. వాహనాన్ని తీసేసినా.. స్క్రాప్ కింద వేసినా.. ఇతరులకు విక్రయించినా ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు తీసుకెళ్లినా అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిందే. జిల్లాలో 5 లక్షల 680 వాహనాలు ఉన్నాయి. వాటిలో లారీలు 21,771, మ్యాక్సీ క్యాబ్‌లు 1320, మోటారు క్యాబ్‌లు 3160, కమర్షియల్ ట్రాక్టర్లు 19,311, ఆటోలు 29,135, స్కూలు బస్సులు 1461తోపాటు ఇతరత్రా ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఉన్నాయి. వాటిలో అనేక సంవత్సరాలుగా త్రైమాసిక పన్ను బకాయిలు ఉన్నారు. అధికారుల గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు 8061 వాహనాలు పన్నులు చెల్లించనవిగా గుర్తించారు. అయితే ఇప్పటికే సదరు వాహన యజమానులకు నోటీసులు జారీ చేయడం తోపాటు నిత్యం పన్ను చెల్లించాలని సమాచారం అందజేస్తున్నారు.



ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కార్యాలయం

లేని వాహనాలు ఎన్నో..

జిల్లాలో త్రైమాసిక పన్నులు చెల్లించాల్సిన వాహనాలు 2061 ఉండగా, వాటిలో అనేక వాహనాలు లేనే లేవని అధికారులు గుర్తించారు. వేలాది వాహనాలు ప్రమాదాలకు గురైనవి, వదిలివేయడం, కాలం చెల్లిన వాహనాలను స్క్రాబ్ వేయడం, ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు తీసుకెళ్లిన వాహనాల గురించి పట్టించుకోకపోవడం, విక్రయించిన వాహనాల గురించి సమాచారం ఇవ్వకపోవడం వంటివి ప్రధానంగా గుర్తించారు. 8061 వాహనాల్లో సుమారు 2000-3000 వాహనాలు స్క్రాబ్ తోపాటు ఇతర అంశాలలో సంబంధిత యజమానుల వద్ద లేనట్లు, గుర్తించినట్లు సమాచారం.


పన్ను పడుతూనే ఉంది..

వాహనాలకు సంబంధించి యజమానుల వద్ద వాహనం లేనప్పటికీ త్రైమాసిక పన్నులు మాత్రం పడుతూనే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వాహనదారులు వాహనాలను స్క్రాబ్ వేసినా, ఇతరత్రా అంశాల్లో కోల్పోయినా, కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో వాటికి పన్నులు పడుతూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు వాహనాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. వాహనాన్ని స్క్రాబ్ కింద తీసివేసినా, ఫైనాన్స్ వారు తీసుకుపోయినా, ప్రమాదం జరిగి ఎక్కడైనా వాహనం నిలిచిపోయినా తప్పనిసరిగా తెలియజేయాల్సిన అవసరం ఉందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

వాహనాలను తీసివేయడం, ఫైనాన్స్ సంస్థల వారు తీసుకెళ్లడం వంటివి గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. వాటికి సంబంధించి యజమానులు దరఖాస్తు చేసుకోకపోవడం వల్ల పన్నులు పెరిగిపోతున్నాయని అధికారులు గుర్తించారు. స్క్రాబ్ చేసిన వాహనానికి సంబంధించి ఛాయిస్ నెంబర్లు దుర్వినియోగానికి పాల్పడితే దానికి సంంధించిన వాహన యజమానే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదే క్రమంలో వాహనం స్క్రాబ్ వేసినట్లు దరఖాస్తు చేసుకుని రోడ్డుపై తిరిగినా తీవ్ర పరిణామాలు ఉంటాయని, వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదుకు అవకాశం ఉందని చెబుతున్నారు. వాహన యజమానులు ఈ విషయాన్ని గుర్తించి వాహనాన్ని తీసివేసినా, ఫైనాన్షియర్లు తీసుకెళ్లినా, ఇతరత్రా అంశాలు జరిగితే దరఖాస్తు చేసుకోవడంతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



వాహనాన్ని తీసివేసినా, స్క్రాబ్‌కు వేసినా, ఫైనాన్షియర్లు తీసుకెళ్లినా ఖచ్చితంగా దరఖాస్తు చేసుకోవడంతోపాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ట్రాన్స్‌పోర్టు వాహనాలైతే వాహనాలు మన దగ్గర లేకపోయినప్పటికీ త్రైమాసిక పన్నులు, ఆపైగా జరిమానాలు పడుతూనే ఉంటాయని యజమానులు గ్రహించాలి. స్క్రాబ్‌కు వేసినప్పటికీ ఛాయిస్ నెంబర్లు దుర్వినియోగం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. యజమానులు గుర్తించి వాహనాల విషయంగా తగు జాగ్రత్తలు తీసుకుని నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలి.

\- ఇ.మీరప్రసాద్,
జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్, కడప